# తప్పుచేసిన దేవుడు (మినీకథ)

రాము ఏడుస్తున్నాడు. అమ్మ, బామ్మ, నాన్న ఎందరు ఓదార్చినా ఆ పసివాడు ఏడుపు మానటం లేదు. ఎంతోసేపటి నుంచి ఏడుస్తుండటంవల్ల కళ్ళు ఎరుపు ఎక్కాయి. కంఠం బొంగురు పోయింది. తల్లి దగ్గరకు తీసుకుని ఊరడిస్తూ వుంది. తల్లి చల్లని

ఒడికూడా ఆ పసివాడిబాధను మరిపించ లేకపోతూంది. ఏవేవో ఆట వస్తువులు తెచ్చి ఇస్తానని, ఎక్కడెక్కడికో షికార్లు తీసుకు వెళ్తానని బుజ్జగిస్తున్నాడు తండ్రి.

నిజానికి రాము ఏడుస్తున్నది. ఏ ఆట వస్తువుల కోసమూ మరే షికార్ల కోసమూకాదు. అయితే తల్లి తండ్రులు అతి సునాయాసంగ రాము కోర్కెలు తీర్చివుండేవారు. ఏడ్చి ఏడ్చి తన ఒడిలో నిద్ర పోయిన బాలుని ఎత్తుకుని మంచంమీద పడుకోబెట్టి నిట్టూర్చింది సుజాత.

తను ఇవ్వలేని సుఖాన్ని తన బిడ్డకు నిద్రాదేవి ఇచ్చింది అనుకుంది. 'ఆదమర్చి నిద్రపోతున్నప్పుడు మాత్రమే వీడికి శాంతి; నిద్రలేస్తే మళ్ళీ ఇంతే'. వాత్సల్యంగా, జాలిగా తన బిడ్డవైపు చూసి మరోసారి నిట్టూర్చింది ఆ మాతృమూర్తి. ఓ వైపున పుట్టి పుట్టగానే తనకు కడుపు శోకము మిగిల్చి మాయమైన పసికూన మనసును కలచి వేస్తుంటే, పుట్టబోయే చెల్లాయిని గురించి ఎన్నో కలలుకని, ఎన్నెన్నో మమతలు పెంచుకున్న పసివాడు చెల్లాయి కోసముఅల్లాడి పోవటం సుజాతను మరింతగా కృంగ దీస్తుంది. వాణ్ని ఎలా సముదాయించాలో, పాపను వాడు మర్చిపోవటానికి తను ఏమి చేయాలో అంతుపట్టడం లేదు.

సుజాతకు ఒక్కసారిగా దుఃఖం ముంచుకొచ్చింది. చేతులలో ముఖము దాచుకొని వెక్కివెక్కి ఏడ్చింది. "బాధపడకు సుజీ మనకు ఆ పాపను పెంచే అదృష్టంలేదు. ఇలా జరిగింది" సుజాత ముఖము తన వైపుకు తిప్పుకుంటూ అన్నాడు శ్రీనివాసు. "పోయిన పాపను గురించి కాదు నా బాధ. చెల్లాయి లేదని బెంగ పెట్టుకుంటున్న

రాముని చూస్తుంటే నా కడుపు తరుక్కుపోతోంది.... తనవల్లనే ఇంత జరిగింది. చిట్టి చెల్లాయిని ఇస్తున్నావు అన్నాడు. తను వాడి వెనుకే నిల్చున్నా గమనించకుండా ఆ పటములోని పరమాత్మునితో కబుర్లు చెప్పేవాడు. "చెల్లాయి బుజ్జిగా వున్నప్పుడు ఎంచక్కా ఎత్తుకొని ఆడిస్తా! కొంచెము పెద్ద అయితే చేయి పట్టుకొని నడిపిస్తా! నడక, మాటలు అన్నీ వచ్చేశాక ఇద్దరంకలసి ఎంచక్కా స్కూలుకి వెళ్ళి చదువుకొంటాం ఇలా సాగిపోయేది.......... పరమాత్మునితో ఆ పసిపాపడి వాక్ ధోరణి. వాడి ఆనందాన్ని చూసి అప్పుడు తను ఎంతో సంతోషించింది. ఇప్పుడు ఇలా కుమిలి పోవలసి వస్తూంది. భగవాన్ ఇవి అన్నీ నీ లీలలేనా? అయితే నా బిడ్డ మనస్సుకు నీవే ఊరట కలిగించు" అనుకుంది

కాల ప్రవాహంలో నెలలు కరిగిపోతున్నా, రాము మాత్రం చెల్లాయిని మరచిపోలేక పోతున్నాడు. రోజూ సాయంత్రము స్కూలు వదలగానే స్కూలుకు దగ్గరగావున్న రాములవారి గుడికి వెళ్తాడు.

చేతులు జోడించి స్వామిఎదురుగా నిలబడి, "దేవుడూ నాచెల్లిని ఎందుకుతీసుకున్నావు, మరి ఎందుకు ఇచ్చావు ? తీసుకోవటానికా ? నేను ఎంత సరదాపడ్డానో నీకు తెలుసుగా, చెల్లాయితో జట్టుగా వుండాలని ఎంత అనుకున్నానో! ఒక్కరోజు వుంచి తీసుకుంటావా? నీకు నా మీద కోపమువచ్చిందా? దేవుడూ నేను ఏమితప్పు చేశాను. ఏమీ చేయలేదే! నా చెల్లాయిని తీసుకోవటం నీదేతప్పు, అసలు నువ్వు మంచివాడివి కాదు. ఆశ పెట్టి మోసము చేశావు. ఇచ్చినట్టే ఇచ్చి, చెల్లాయిని లాక్కున్నావు. నువ్వే ఎత్తుకుపోయావని అమ్మ, బామ్మ అందరూ అంటున్నారు.

నువ్వెంతో మంచివాడివి అనుకున్నాను, మరెందుకు ఇలా

చేశావు...." ఆ విగ్రహంతో తన ఆవేదనంతా వెళ్ళబోసుకుంటాడు ఆరేళ్లు నిండని ఆ పసిపాపడు. నిజంగా ఆ విగ్రహంలోనే పరమాత్ముడు వుంటే, ఎంత పశ్చాత్తాప పడేవాడో!

ఇదే జరిగిందేమో—ఏడాది తిరక్కుండానే రాముకి మళ్ళీ చెల్లాయి పుట్టింది. ఈసారి రామూ ఊహలు అన్నీ నిజం అయ్యాయి. బుజ్జి చెల్లాయిని ఎత్తుకుని ఆడించాడు. చేయి పెట్టుకొని నడక నేర్పాడు. ముద్దు ముద్దుగా అన్నా అని పిలుస్తూవుంటే మురిసిపోయాడు.

ఇప్పుడిప్పుడే రాముతో స్కూలుకు కూడా వెళ్తోంది పాప. రోజూ తనే చెల్లాయి చేత అక్షరాలు దిద్దిస్తాడు. ఇప్పుడు రాము మనసు నిండా ఎంతో సంతోషం. చెల్లాయితో ఎన్నెన్నీ మురిపాలో! దాన్ని విడిచి ఒక్కక్షణం కూడా వుండలేడు.

చల్లని సాయంత్రం వేళ వీధి వాకిట్లో కూర్చుని చదువుకుంటున్నాడు. తన ప్రక్కనే చెల్లాయిని కూర్చొపెట్టుకొని అక్షరాలు దిద్దిస్తున్నాడు. అన్నయ్యా! ఎంతదిద్దినా ఈ రెండుఅక్షరాలు రావటం లేదు. తప్పులొచ్చేస్తున్నాయి" తనకు సరిగ్గారాని రెండు అక్షరాలు రామూకి చూపించి పాప బిక్కముఖం పెట్టింది. చెల్లాయి భయపడకు! అలా దిద్దుతుంటే అవే వస్తాయి. తప్పు దిద్దుకుంటే అదే ఒప్పు అవుతుంది.

దేవుడు కూడా ఒక్కోసారి తప్పులుచేసి దిద్దుకొంటాడు తెలుసా" అన్నాడు. ఆ పసిపాపడి మాటకు పరమాత్ముడు ఎక్కడ ఏ రూపంలో వున్నా అతని పెదవులపై దరహాస రేఖలు విరియక మానవు.